

నేడు మాజీ ఉప రాష్ట్రపతి రాక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు బుధవారం జిల్లాకు రానున్నారు. ఈ మేరకు ఆయన క్యాంపు కార్యాలయం ఒక ప్రకటన జారీ చేసింది. 19న ఉదయం 6.30 గంటలకు రాజాం నుంచి బయలుదేరి ఉదయం 7.30 గంటలకు శ్రీకాకుళం ఆర్అండ్‌బి అతిథిగృహానికి చేరుకుంటారు. ఉదయం 9.10 గంటలకు ఆర్అండ్‌బి నుంచి బయలుదేరి 9.15 గంటలకు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళ్లర్పిస్తారు. 9.30 గంటలకు అక్కడ్నుంచి బయలుదేరి 9.50 గంటలకు రాగోలులోని జెమ్స్ ఆస్పత్రికి చేరుకుంటారు. పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జెమ్స్ వైద్య కళాశాల విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు అక్కడ నుంచి విశాఖపట్నంకు బయలుదేరి వెళ్తారు.

కొత్త వరాలా..?

సమస్యలకు పరిష్కారాలా..?

- ఆధునికీకరణకు నోచుకోని వంశధార ఎడమ కాలువ
- సిఐడి కేసులతో అపరిష్కృతంగా షట్టర్ల సమస్య
- మత్స్యకారులకు ఒక్క కోల్డ్ స్టోరేజ్ లేని వైనం
- నేడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జిల్లాకు రాక
- మూలపేట పోర్టుకు శంకుస్థాపన

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. సంతబొమ్మాళి మండలం మూలపేట వద్ద పోర్టుకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం నౌపడలో నిర్వహించనున్న బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాకు ప్రకటించనున్న వరాలపై అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వీటితో పాటు జిల్లాలో వ్యవసాయ, సాగునీటిరంగ సమస్యలు ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా, వంశధార ప్రాజెక్టు ఎడమ కాలువ పనులు ఆధునికీకరణకు నోచుకోవడం లేదు. సిఐడి కేసులతో వంశధార షట్టర్ల అంశం దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. సిఎం చొరవ చూపితే గానీ ఆ సమస్య పరిష్కారమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. పోర్టు నిర్మాణం మత్స్యకారులతో ముడిపడి ఉన్న నేపథ్యంలో ప్రత్యేకంగా హామీలేమైనా ఇస్తారా అని వారు ఆశగా ఎదురుచూస్తున్నారు.

వంశధార ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన నాటి నుంచి కాలువలు ఆధునికీకరణ పనులకు నోచుకోలేదు. ప్రధానంగా ఎడమ కాలువ పరిస్థితి దయనీయంగా ఉంది. 12 మండలాల పరిధిలోని 1,48,000 ఎకరాలకు సాగునీరందించేలా కాలువను నిర్మించారు. కాలువ నుంచి 2,480 క్యూసెక్కుల నీరు విడిచిపెట్టేలా కాలువను డిజైన్ చేశారు. బ్యారేజీలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్న రోజుల్లోనూ 1600 క్యూసెక్కులకు మించి విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. ఆధునికీకరణ పనులకు రూ.834 కోట్లు అవసరమని 2021-22 కొత్త ఎస్ఎస్ఆర్ (షెడ్యూల్ స్టాండర్డ్ రేట్స్)తో నివేదికను గతేడాది పంపారు. ఏడాది గడిచినా ఇప్పటివరకు ప్రభుత్వం ఆమోదం తెలపలేదు. గొట్టాబ్యారేజీ కుడి ప్రధాన కాలువదీ అదే దుస్థితి. కాలువ గట్లు కోతకు గురయ్యే ప్రాంతంలో సిసి లైనింగ్ పనుల కోసం 2021-22లో రూ.18.45 కోట్లతో అంచనాలతో రూపొందించిన ప్రతిపాదనలు పెండింగ్‌లోనే ఉన్నాయి.

వంశధార షట్టర్ల సమస్య తీరేదెప్పుడో?

వంశధార శివారు భూముల సాగునీటికి షట్టర్ల కుంభకోణం కేసు అడ్డంకిగా మారింది. షట్టర్ల కొనుగోళ్లలో అవినీతిపై 2009లో సిఐడి కేసు నమోదు చేసింది. దీనిపై నేటికీ హైకోర్టులో విచారణ సాగుతోంది. ఘటన జరిగి 14 ఏళ్లు అవుతున్నా, నేటికీ విచారణ కొలిక్కి రాలేదు. దీంతో కాలువలపై కొత్త షట్టర్లను ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. సాగునీటి సలహా మండలి, జిల్లా సమీక్షా కమిటీ సమావేశాలు తదితర సందర్భాల్లో జలవనరులశాఖ అధికారులు పలు పర్యాయాలు ప్రస్తావిస్తున్నా ఫలితం కనిపించడం లేదు. దీనిపై సిఎం స్పందిస్తే షట్టర్ల సమస్య తీరనుంది.

మత్స్యకారులకు ఒక్క కోల్డ్ స్టోరేజ్ లేని వైనం

జిల్లాలో 193 కిలోమీటర్ల సుదీర్ఘ సముద్రతీరం ఉన్నా ఎక్కడా కోల్డ్ స్టోరేజ్ లేదు. దీంతో మత్స్యకారులు ఏ రోజు మత్స్య సంపదను ఆ రోజే అమ్ముకోవాల్సి వస్తుండడంతో సరైన ధర దక్కడం లేదు. పాలకులు మారుతున్నా కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం మత్స్యకారులకు నెరవేరని కలగానే మిగిలింది. తమ పిల్లలను చదివించుకునేందుకు ఆశ్రమ పాఠశాల కావాలని మత్స్యకారులు చాలాకాలంగా కోరుతున్నారు. భావనపాడు పోర్టు నిర్మాణంతో భావనపాడు, గెద్దలపాడు ప్రాంతాల్లో మత్స్యకారులకు చేపల వేట సాధ్యపడదని, జగన్నాథపురం ప్రాంతంలో మినీ జెట్టీ నిర్మాణం చేపట్టాలని మత్స్యకారులు కోరుతున్నారు.

వంశధార నిర్వాసితులకు అందని ఎక్స్‌గ్రేషియా

తాము అధికారంలోకి వస్తే వంశధార నిర్వాసితులకు 2013 చట్టం అమలు చేస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీనిచ్చారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా కేవలం ఎక్స్‌గ్రేషియాతో సరిపెట్టారు. భూములు ఇచ్చిన రైతులకు ఎకరాకు రూ.లక్ష, పిడిఎఫ్ కుటుంబానికి రూ.లక్ష ఇస్తామని గతేడాది జూన్‌లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిర్వాసితులకు రూ.188 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.149 కోట్లే ఇచ్చింది.

నాలుగేళ్లలో నెరవేరినవి కొన్ని హామీలే...

జిల్లా పర్యటనల్లో భాగంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పలు సందర్భాల్లో అనేక హామీలిచ్చారు. వాటిలో కొన్ని మాత్రమే నెరవేరాయి. ఇంటిగ్రేడెట్ కలెక్టరేట్ కాంప్లెక్స్‌ను పూర్తి చేయడానికి అదనంగా మరో రూ.69 కోట్ల మంజూరు హామీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తోంది. శ్రీకాకుళం నగరంలో టిడిపి హయాంలో కూలగొట్టిన కోడిరామ్మూర్తి స్టేడియం బాగు చేయడానికి అదనంగా రూ.10 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించినా ఉత్తర్వులు ఇవ్వలేదు. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస నాలుగు లైన్ల రోడ్ల విస్తరణలో భవనాలు కోల్పోనున్న వారి కోసం రూ.18 కోట్లు, నరసన్నపేట ఆర్ అండ్ బి రోడ్డు విస్తరణ కోసం, సెంట్రల్ లైటింగ్ కోసం రూ.10 కోట్లకు అధికారులు ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం నుంచి ఆమోదం రాలేదు. మడపాం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ వల్ల నాలుగు వేల ఎకరాలకు అదనంగా సాగునీటి కోసం రూ.15 కోట్లు ఇస్తామని వాగ్దానం చేశారు. ప్రస్తుతం అది ప్రతిపాదనల దశలోనే ఉంది. బొంతు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ బ్యాలెన్స్ వర్క్స్ పూర్తి చేయడానికి రూ.40 కోట్ల మంజూరుకు హామీనిచ్చిన సందర్భంలో పాత బిల్లుల చెల్లింపుల కోసం రూ.30 కోట్లు విడుదల చేసింది. నరసన్నపేట నియోజకవర్గానికి గుడిపేట వద్ద రివర్స్ ఫ్లో ఆటోమేటిక్ పాలింగ్ షట్టర్స్, వంశధార కెనాల్ మీద డి.ఎల్ పురం వద్ద లో లెవల్ కాజ్‌వే, నరసన్నపేటలో రాజుల చెరువు అభివృద్ధికి రూ.10 కోట్లు తదితర అంశాలపై ఇచ్చిన హామీల్లో కదలిక లేదు.

జిల్లాకు రావడం ఆరోసారి

ముఖ్యమంత్రి పదవిని అధిష్టించిన తర్వాత జగన్ జిల్లాకు రావడం ఇది ఆరో పర్యాయం. తొలిసారి 2019 సెప్టెంబర్ ఆరో తేదీన ఇంటింటికీ రేషన్ పంపిణీ పథకం పైలట్ ప్రాజెక్టును పలాస నుంచి ప్రారంభించారు. తర్వాత 2021 నవంబరు తొమ్మిదో తేదీన పాతపట్నంలో నిర్వహించిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి కుమార్తె వివాహానికి హాజరయ్యారు. గతేడాది శాసనసభాపతి తమ్మినేని సీతారాం తనయునికి వివాహానికి హాజరయ్యారు. నరసన్నపేటలో నిర్వహించిన రెండో విడత వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం హక్కు పత్రాలను పంపిణీ చేసేందుకు వచ్చారు. గతేడాది జూన్ 26వ తేదీన అమ్మఒడి పథకం డబ్బులను శ్రీకాకుళం నుంచే తల్లుల ఖాతాలో వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. తాజాగా మూలపేట పోర్టు శంకుస్థాపనకు వస్తున్నారు.


సిద్ధం చేస్తున్న సభా ప్రాంగణం

సిఎం పర్యటనకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లను పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- 2,253 మందితో పటిష్ట పోలీసు బందోబస్తు
- 225 బస్సులు వినియోగం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, నౌపడ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటనకు సర్వం సిద్ధమైంది. అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. నౌపడ సభ ప్రాంగణం నుంచే నౌపడలో ఆర్ అండ్ ఆర్ కాలనీ శంకుస్థాపన, బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్‌కు శంకుస్థాపన, గొట్టాబ్యారేజీ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించే శిలా ఫలకాలను ఏర్పాటు చేశారు. మూలపేటకు ఉదయం 10.15 గంటలకు సిఎం చేరుకున్న నాటి నుంచి భూమి పూజ, పైలాన్ ఆవిష్కరణ, గంగ పూజ, నౌపడలో బహిరంగ సభ అనంతరం తిరిగి వెళ్లే వరకు అన్ని ఏర్పాట్లను మంగళవారం అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. సభా ప్రాంగణంలో ప్రజల కోసం 24 గ్యాలరీలను ఏర్పాటు చేశారు. ఒక్కో గ్యాలరీలో 650 మంది ఉండేందుకు కుర్చీలు వేశారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొంటే ఉండేందుకు వీలుగా సభా ప్రాంగణం చుట్టూ టెంట్లు వేసి సిద్ధం చేశారు. సభకు తరలివచ్చే ప్రజలకు తాగునీరు, మజ్జిగ అందుబాటులో ఉంచారు. మూలపేట, నౌపడలోని ఐదు పిహెచ్‌సిల పరిధిలోని వైద్య సిబ్బందితో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి వినతులు తీసుకునేందుకు సభా ప్రాంగణం ముఖద్వారంలో ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేశారు. 108, 104 వాహనాలతో పాటు ఫైర్ సేఫ్టీ వాహనాలను అందుబాటులో ఉంచారు.

2,253 మందితో పటిష్ట పోలీసు బందోబస్తు

సిఎం పర్యటనకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసు శాఖలోని అన్ని కేటగిరీలు కలిపి మొత్తం 2,253 మందిని వినియోగిస్తున్నారు. ముగ్గురు ఎఎస్‌పిలు, పది మంది డిఎస్‌పిలు, 40 మంది సిఐలు, 150 మంది ఎస్ఐ, ఎఎస్ఐలను కేటాయించారు. వీరితో పాటు 550 మంది ఆర్మ్‌డ్ సిబ్బంది, పోలీసు కానిస్టేబుల్స్, హెడ్ కానిస్టేబుల్స్, మహిళా కానిస్టేబుల్స్, హోంగార్డులు కలిపి 1500 మంది విధులకు కేటాయించారు. ముఖ్యమంత్రి హెలీప్యాడ్ నుంచి శంకుస్థాపన ప్రాంతానికి కాన్వాయ్‌లో వెళ్లేందుకు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో వివిఐపిలు, ఉన్నతాధికారులకు తప్ప ఇతరులకు ప్రవేశం కల్పించలేదు. కొంతమంది నిర్వాసిత గ్రామస్తులు, అధికారులు, మంత్రుల సమక్షంలో ముఖ్యమంత్రి గంగ పూజ నిర్వహించి శంకుస్థాపన చేస్తారు. పైలాన్‌ను ఆవిష్కరించిన అనంతరం హెలీకాప్టర్‌లో నౌపడలోని సభా ప్రాంగణానికి చేరుకుంటారు.


మూలపేట తీరంలో సిఎం జగన్ సైకతశిల్పం

245 ఆర్‌టిసి బస్సులు వినియోగం

సిఎం పర్యటనకు 245 ఆర్‌టిసి బస్సులను వినియోగించనున్నారు. ఇందులో శ్రీకాకుళం ఒకటో డిపో నుంచి 48 బస్సులు, రెండో డిపో నుంచి 50 బస్సులు, టెక్కలి డిపో నుంచి 31, పలాస డిపో నుంచి 51 బస్సులను నడపనున్నారు. వీటితోపాటు పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ డిపో నుంచి 40 బస్సులు, విజయనగరం జిల్లా విజయనగరం డిపో నుంచి 25 బస్సులను నడపనున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

సిఎం పర్యటనా ఏర్పాట్లను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి జి.ఆర్ రాధిక మంగళవారం పరిశీలించారు. సభా ప్రాంగణం, హెలీప్యాడ్, వివిఐపిల పార్కింగ్, సభకు వచ్చే ప్రజల వాహనాల పార్కింగ్ స్థలాలను చూశారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ పేరాడ తిలక్, జాయింట్ కలెక్టర్ నవీన్, సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, కలెక్టర్ తదితరులు

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని జెఎసి అమరావతి జిల్లా చైర్మన్ కె.శ్రీరాములు విమర్శించారు. నగరంలోని అంబేద్కర్ కూడలిలో గల రెవెన్యూ అతిథిగృహం ఆవరణలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సంఘ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 డిమాండ్లను ప్రభుత్వం ముందుంచామని, వాటిని పరిష్కరించి ఉద్యోగులకు సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించడంలో, ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేయడంలో ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. తామేమీ గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, న్యాయసమ్మతంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. నాలుగేళ్లుగా ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలన్నింటినీ చెల్లించాలని కోరారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకొస్తే ఆరు నెలల్లోనే సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తామని హామీనిచ్చినా నేటికీ రద్దు చేయలేదని విమర్శించారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతభత్యాలను పెంచాలన్నారు. ఉద్యోగుల హెల్త్ కార్డులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, కరోనా ముందు కరోనా సమయంలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియమాకాలను వెంటనే చేపట్టాలని కోరారు. ఆర్‌టిసి ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఒటి, నైట్ డే అవుట్ అలవెన్స్, విలీనం అనంతరం తొలగించిన సౌకర్యాలన్నీ కొనసాగించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జెఎసి అమరావతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి రమణ, రెవెన్యూ సర్వీసుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు దిలీప్ చక్రవర్తి, మురళీధర్ నాయక్, కోశాధికారి జి.ఎల్.ఇ శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.గోవిందరావు, ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నానాజీ తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నిర్వాసితులు

సిఎం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద వంశధార నిర్వాసితుల ధర్నా


ప్రజాశక్తి - కొత్తూరు

వంశధార నిర్వాసితులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై వ్య.కా.స ఆధ్వర్యాన నిర్వాసితులు తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా జగన్ నిర్వాసితుల దీక్షా శిబిరాన్ని సందర్శించి, అధికారంలోకొచ్చాక 2013 భూసేకరణ చట్టాన్ని వర్తింపజేసి పరిహారం చెల్లిస్తామని చెప్పారని గుర్తుచేశారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా, మెళియాపుట్టిలో ఎన్నికల సభలో మరోసారి నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి హామీలు ఇచ్చారని చెప్పారు. అధికారంలోకొచ్చి నాలుగేళ్లవుతున్నా నేటికీ ఆ ఊసెత్తడం లేదని విమర్శించారు. నిర్వాసితులకు అదనపు పరిహారం పూర్తిస్థాయిలో చెల్లించకుండా, సగం మందికే పంపిణీ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందని విమర్శించారు. అర్హులైన నిర్వాసితులందరికీ అదనపు పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న అదనపు పరిహారం ఎప్పుడు చెల్లిస్తారో ప్రకటించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ నిర్వాసితులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, లేకుంటే నిర్వాసితుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రజల మద్దతుతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో సంఘ నాయకులు తులసీరావు. ఎ.కృష్ణమూర్తి, కె.హారిక, నిర్వాసితులు కె.జోగమ్మ, కె.మీనా, బి.అప్పలమ్మ తదితరులు పాల్గొన్నారు.

1, 2న మేడే సాంస్కృతిక ఉత్సవాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మే 1, 2 తేదీల్లో మేడే సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, జిల్లా కార్యదర్శి ఎ.మహాలక్ష్మి, నగర కన్వీనర్ కె.సూరయ్య, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎం.ప్రభాకరరావు తెలిపారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సిఐటియు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నగరంలోని బాపూజీ కళామందిర్ వేదికగా సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మిక పాటలు, నృత్యాలు, ఫోక్ డాన్సులు, పాటల కచేరి, ఫ్యాన్సీ డ్రెస్ షో, మ్యాజిక్ షో, పాటలు, గజల్స్, జానపద నృత్యం, కోలాటం, వెస్టర్న్ డ్యాన్స్, డప్పు, వాయిద్యం, స్కిట్స్ నాటికలు తదితర కళారూపాల ప్రదర్శనలు ఉంటాయన్నారు. కళారూపాలను ప్రదర్శించే వారు ఈనెల 23వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు 8332896919, 92487650225, 63014854566, 8008353892, 8374767462, 9703074279, 9440121789 ఫోన్ నంబర్లను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో కార్మికులు, కుటుంబసభ్యులు, మున్సిపల్, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, ముఠా కార్మికులు, ఆటో, షాపు వర్కర్లు, బ్యాంకు, ఇన్సూరెన్సు ఉద్యోగులు, ఉపాధ్యాయులు తదితరులు భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

23న జీడి రైతుల సదస్సు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు


జీడి రైతుల సదస్సును పలాసలోని లాస్య ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 23వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి టి.భాస్కరరావు, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి డి.భాస్కరరావు తెలిపారు. సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని డోకులపాడు, శారదాపురం, పల్లిసారథి తదితర గ్రామాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేల మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో కొయిరి భీమారావు, అంబటి కృష్ణ, డి.కూర్మారావు, ఎస్.మధు తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న నాయకులు

పథకాలకు అర్హతే ప్రామాణికం

ప్రజాశక్తి - పొందూరు

అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని బొడ్డేపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ఆ కుటుంబానికి ఈ నాలుగేళ్లలో పలు పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాల వల్ల జనం నీరాజనం పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, సర్పంచి ప్రతినిధి బొడ్డేపల్లి రమణ, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్ కుమార్, వైసిపి మండల అధ్యక్షుడు పి.రమేష్ కుమార్, పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, వైసిపి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాలపై మహిళలతో మాట్లాడుతున్న స్పీకర్

పోర్టు పేరు మార్పు తగదు

ప్రజాశక్తి- నౌపడ

భావనపాడు పోర్టు పేరును మూలపేటగా నామకరణం చేయడాన్ని నిరసిస్తూ భావనపాడు గ్రామస్తులు మంగళవారం నిరసన తెలిపారు. పోర్టు పేరు మార్పును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాలుగు దశాబ్దాలుగా భావనపాడు పోర్టు పేరు వింటున్నామని, గత ప్రభుత్వం భావనపాడు పోర్టు పేరిటే భూసేకరణ నోటిఫికేషన్ విడుదల చేసిందని అన్నారు.

పోర్టు పేరెత్తితే గుర్తొచ్చేది భావనపాడు పేరు అని, ఆ పేరును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అడ్ల రాజేష్, సైని గురువులు, జి.తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన నాయకులకు నోటీసులు

ప్రజాశక్తి - పలాస

సిఎం జగన్మోహన్ రెడ్డి బుధవారం జిల్లా పర్యటన నేపథ్యంలో గిరిజన సంఘాల నాయకులకు పోలీసులు మంగళవారం నోటీసులు ఇచ్చారు. బోయ వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్‌టిల్లో చేర్చేందుకు అసెంబ్లీలో చేసిన తీర్మానానికి వ్యతిరేకంగా, జిఒ నంబరు 52 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను అడ్డుకుంటామని గిరిజన సంఘాలు పిలుపునిచ్చిన విషయం విదితమే.


రాంబాబుకు నోటీసు అందజేస్తున్న పోలీస్

ఈ నేపథ్యంలో గిరిజన సంఘాల జెఎసి జిల్లా అధ్యక్షులు సవర రాంబాబు, ఆలిండియా ఆదివాసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సవర జగన్నాయకులకు కాశీబుగ్గ పోలీసులు ముందస్తు నోటీసులు అందజేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలు చేపట్టవద్దని అందులో పేర్కొన్నారు. గిరిజనులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని జెఎసి జిల్లా అధ్యక్షులు సవర రాంబాబు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బోయ వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.



రమణయ్యను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

భవన నిర్మాణ కార్మికుడు వంజరాపు రమణయ్యను విచక్షణా రహితంగా మారణాయుధంతో తల పగలకొట్టిన నిందితుడిని పోలీసులు తక్షణమే అరెస్టు చేయాలని, లేకుంటే ఆందోళన చేపడతామని సిఐటియు జిల్లా నాయకులు భవిరి కృష్ణమూర్తి ప్రభుత్వానికి హెచ్చరించారు. స్థానిక ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమణయ్యను మంగళవారం పరామర్శించారు. అనంతరం దాడి జరిగిన ఘటన పూర్వపరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. తమ స్థలంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతున్న కన్నయ్యను తాము వ్యాపారం చేసుకోవడానికి వీలుగా ఖాళీ చేసి ఇవ్వాలని కోరగా కోపోద్రిక్తుడైన కన్నయ్య మరుగుతున్న నూనెను రమణయ్య పాదాలపై ఒంపి లోహ మారణాయుధంతో తలపై విచక్షణా రహితంగా కొట్టడంతో రక్త గాయాలయ్యి స్పృహ కోల్పోయి పడిపోయాడని కుటుంబ సభ్యులు వివరించారు. ఈ నెల 12న దాడి జరిగినా నేటికీ పోలీసులు నిందితుడిని పట్టుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కృష్ణమూర్తి విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి నిందితులను పట్టుకోకుండా తాత్సారం చేయడం చట్ట వ్యతిరేకమన్నారు. పరామర్శించినవారిలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, నరసన్నపేట భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఆర్.సురేష్‌బాబు, కమిటీ సభ్యులు కొర్రాయి కృష్ణ ఉన్నారు.



నియామక పత్రాలను అందుకున్న అంగన్వాడీలు

అంగన్వాడీలకు నియామక పత్రాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గ పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తల, సహాయకుల పోస్టులకు ఎంపికైన వారికి నియామక పత్రాలను స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో స్పీకర్ తమ్మినేని సీతారాం మంగళవారం అందజేశారు. పొందూరు మండలం తోలాపికి చెందిన పూజారి లత, ఆమదాలవలస మండలం చీమలవలసకు చెందిన కంచరాపు లత, మున్సిపాలిటీలోని రెండో వార్డు కృష్ణాపురానికి చెందిన బి.ఝాన్సీరాణి, ఎల్ఎన్‌పేట మండలం తురకపేటకు చెందిన టి.తులసీభాయ్‌లకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించి సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఆలోచనలు లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసే మెరుగైన సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, సిడిపిఒ కె.బాలామణి, సురవరపు నాగేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్ కుమార్, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, దుంపల శ్యామలరావు, బొడ్డేపల్లి నారాయణరావు, బెవర మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

బిజెపి విధానాలను వ్యతిరేకిద్దాం



శ్రీకాకుళం అర్బన్ : ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బిజెపిని సాగనంపుదాం - దేశాన్ని కాపాడుకుందాం అన్న నినాదంతో సిపిఐ, సిపిఎం సంయుక్తంగా నిర్వహించిన ప్రచారభేరి ఐదో రోజున నగరంలోని తుమ్మావీధి, బర్మాకాలనీ, కత్తెర వీధి ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, సిపిఎం నగర కన్వీనర్ టి.తిరుపతిరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ హయాంలో దళితులకు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం తీరుతో దళిత, గిరిజన, మహిళలు సంక్షేమానికి, సామాజిక న్యాయానికి దూరమైపోతున్నారని విమర్శించారు. మత విద్వేషాలు, కుల వివక్ష, పెత్తందారీ పద్ధతులతో మనువాద శక్తులు పెట్రేగిపోతున్నారని అన్నారు. కార్పొరేట్లకు రాయితీలు, పేదలకు కష్టాలు, కన్నీళ్లు తప్ప సంతోషం లేదని అన్నారు. విశాఖ ఉక్కును అమ్మేయడంతో మోడీ అభిమానం ఉత్తరాంధ్రపై ఏపాటిదో అర్థమైందన్నారు. ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు డోల శంకరరావు, వెంకటరావు, పాణిగ్రహి, కె.భాస్కరరావు, శ్రీదేవి పాణిగ్రహి, పి.ప్రభావతి, ఎం.లలిత, ఎ.మహాలక్ష్మి, ఎస్.శ్రీనివాసులు, కె.శ్రీనివాసరావు, పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మందస : ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న మోడీ నిరంకుశ విధానాలను వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు పిలునిచ్చారు. సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన మందసలోని మెయిన్ రోడ్ కరణం వీధి, పరిసర వీధుల్లో ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు దేశ సంపద దోచిపెట్టి ప్రజలపై భారాలు మోపుతుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు అమ్మేస్తూ... కార్మికులకు ఉపాధి లేకుండా చేసుందన్నారు. రైతులకు, ఉపాధి హామీ కూలీలకు బడ్జెట్‌లో నిధులు తగ్గించి మోసం చేస్తున్నారని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రచారం చేపడుతున్నామని, ప్రజలు ఈ పోరాటంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.గణపతి, ఎం.ధర్మారావు, ఆర్.దిలీప్‌కుమార్, ఎస్.వల్లభరావు, జయరాం పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరు : పోస్టర్‌ను అందజేస్తున్న ఆనందరావు



మందస : ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

వజ్రపుకొత్తూరు : ప్రజలపై భారాలు మోపి కార్పొరేటర్లకు దోచి పెతుతున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలాని సిపిఎం నాయకులు బి.ఆనందరావు పిలుపునిచ్చారు. మండలంలోని గుళ్లలపాడులో సమరభేరి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ఎన్.మోహనరావు, మండల కమిటీ సభ్యులు బి.రామకృష్ణ, డి.భానుమతి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒరియా అధ్యాపకులుగా, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ నిత్యానంద పట్నాయక్ రచించిన కవి సౌర్యబౌముడు శ్రీనాథ్, ఒరియా కవి సామ్రాట్ ఉపేంద్ర బంజా రచనలపై పరిశోధనల చేసిన వాటిని పుస్తక రూపంలో ప్రచురించారని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రోబిన్ కుమార్ పాడి తెలిపారు. డిగ్రీ కళాశాలలో మంగళవారం పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యానంద పట్నాయక్ తన పిహెచ్‌డి పరిశోధన నివేదికను పుస్తక రూపంలో ప్రచురించారని అన్నారు. ప్రముఖ కవులు, రచనలు గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుశాంత్ జేన్న, కో-ఆర్డినేటర్ పి.రామకృష్ణ, డాక్టర్ రాజేంద్ర త్రిపాఠి పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ కుమార్ పాడి

తేనెటీగల పెంపకంపై శిక్షణ

ప్రజాశక్తి- బూర్జ

గిరిజన మహిళలు వస్తు విలువ ఆధారిత అభివృద్ధిపై, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా నౌబార్డు మేనేజర్ నాగార్జున అన్నారు. మండలంలో గోపిదేవిపేటలో నాబార్డు సహకారంతో ఆర్ట్స్ సంస్థ 90 మంది మహిళలకు జీవనోపాధుల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా తేనెటీగల పంపకంపై మంగళవారం మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు ఉత్పత్తుల కంపెనీల ద్వారా మార్కెటింగ్ సదుపాయం కల్పించుకుని తద్వారా అదనపు ఆదాయం పొందే విధంగా కృషి చేయాలన్నారు. ఆర్ట్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ తేనె టీగలు పంపకం వల్ల మహిళలకు అదనపు ఆదాయం వస్తుందని అన్నారు. ప్రతిఒక్కరూ యాజమాన్య పద్ధతులు పాటిస్తే భవిష్యత్‌లో మంచి ఆదాయం వస్తుందని తెలిపారు ఈ శిక్షణ నేర్చుకొని తేనె టీగల పెంపకం చేస్తే మంచి ఆదాయం వస్తుందని అన్నారు. ఈ శిక్షణలో మెలకువలు పాటించాలన్నారు. కార్యక్రమంలో రిసోర్‌పర్సన్ కాంతారావు, మన్యం సహజ కంపెనీ సిఇఒ బి.శంకరరావు, ఎం.రవి, గణేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగార్జున

సిఎం పర్యటనను విజయవంతం చేయాలి

టెక్కలి రూరల్ : సంతబొమ్మాళి మండలం మూలపేటలో బుధవారం సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కేంద్ర మాజీ మంత్రి, వైసిపి జిల్లా నాయకులు కృపారాణి ఒక ప్రకటనలో కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తొలి దశలో రూ.4,361 కోట్లతో గ్రీన్‌పోర్టు శంకుస్థాపన చేస్తారని అన్నారు. దీని సామర్థ్యం 83.3 మిలియన్ టన్నులు ఉంటుందని తెలిపారు. మన రాష్ట్రంతో పాటు మధ్యప్రదేశ్, ఛత్తీష్‌గఢ్, జార్ఖండ్, దక్షణ ఒడిశాలకు పోర్టు నిర్మాణం కీలకం కానుందని చెప్పారు. దీని ద్వారా బొగ్గు, ఎరువులు, సున్నపురాయి, వంటనూనె, జీడిపిక్కలు దిగుమతి చేసుకోవచ్చన్నారు. ముడి ఇనుము, సిలికా, సోయామీల్, గ్రానైట్, జూట్, స్టీల్ ఎగుమతి చేయనున్నట్టు తెలిపారు. వలసల నివారణ ధ్యేయంగా ప్రభుత్వం పోర్టు నిర్మాణం చేపట్టనుందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 25 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని తెలిపారు.



చెక్కును అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

'అరబిందో' ఆర్థికసాయం

ప్రజాశక్తి- రణస్థలం

విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం చింతపల్లికి చెందిన మత్స్యకారులు కుటంబ పోషణ కోసం చేపల వేటకు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి ఇటీవల ముగ్గురు మృతి చెందారు. విషయం తెలుసుకున్న అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు పైడిభీమవరం అరబిందో పరిశ్రమలో ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షలు చొప్పున చెక్కులను మంగళవారం అందజేశారు. అరబిందో యాజమాన్య ప్రతినిధి నిత్యానంద రెడ్డి మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబాలకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆదుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

మున్సిపాల్టీ అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి- పలాస



శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ గిరిబాబు

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. 12వ వార్డు తాటివీధిలో రూ.2.70 లక్షల మున్సిపాల్ సాధారణ నిధులతో సిసి రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 14వ ఆర్థిక ప్రణాళిక సంఘం నిధులతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. మున్సిపల్ పాలన ఏర్పడి రెండేళ్లలో పార్టీలకతీతంగా అన్ని వార్డులనూ అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పోతనపల్లి ఉమాకుమారి, హరి, వైఎస్ చైర్మన్లు బొర కృష్ణారావు, మీసాల సురేష్, పలాస ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ భవానీ, వైసిపి పట్టణ అధ్యక్షులు సనపల సింహాచలం, కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్, సత్యంలు పాల్గొన్నారు.



మెమొంటోను అందజేస్తున్న చిట్టిరాజు

ఆర్‌డి కమిషనర్‌ను కలిసిన పీడీ

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్‌గా పి.సూర్యకుమారి అమరావతిలో బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు డ్వామా పీడీ జి.వి.చిట్టి రాజు మంగళవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆమెకు పుష్పగుచ్ఛంతో పాటు మెమొంటోను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలు చేస్తున్న ఉపాధి హామీ అమలు తీరును ఆమెకు వివరించారు. సగటు కూలి, చెల్లింపులు, బకాయిలు తదితర అంశాలను వివరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



రణస్థలం : ప్రచారం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- రణస్థలం

'మా నమ్మకం నువ్వే జగన్' అన్నది ప్రజల నినాదమని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పాతర్లపల్లిలో సచివాలయ కన్వీనర్లతో, గృహసారథులతో మంగళవారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులందరికీ మధ్యవర్తులు లేకుండా సంక్షేమ పథకాలను సిఎం జగన్ అందిస్తున్నారని అన్నారు. భావితరాలు ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్లి చదువు, ఉద్యోగాలు చేసేందుకు ఈ రాష్ట్రం ఒక వేదికగా ఉండేలా తీర్చిదిద్దిన పాలకులు జగన్ అని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి టొంపల సీతారాం, జెసిఎం ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి ప్రతినిధి మైలపల్లి కామరాజు, పాతర్లపల్లి సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ పాల్గొన్నారు.

లైదాంలో సబ్ పోస్టాఫీసు ప్రారంభం

ప్రజాశక్తి- పొందూరు



ప్రారంభిస్తున్న సత్యనారాయణ

ప్రభుత్వం అందజేస్తున్న పోస్టల్ సేవలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని లైదాంలో సబ్ పోస్టాఫీసు కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో పొందూరు పరిధిలో ఉండడంతో పోస్టీఫీసు పనులు కోసం ఎన్నో వ్యయప్రయాసలు పడి వెళ్లివారని అన్నారు. ఇప్పుడు ఆ అవసరం లేకుండా ఇక్కడే ఖాతాలను తెరుచుకుని, లావాదేవీలు నిర్వహించుకోవచ్చునని తెలిపారు. అలాగే పిన్‌కోడ్ 532167గా మారిందని, ఈ పిన్‌కోడ్ పరిదిలోకి లైదాం, సిరిపురం, మంతిన, మిర్తివలస, హోంజరాం, తమరాం, చిత్తారిపురం, వాల్తేరు, గోకర్ణపల్లి, తుంగపేట, గోరింట పోస్టాఫీసులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్లె అనంతరామకృష్ణ, రాజాం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, పొందూరు ఎస్‌పిఎం సురేష్ పాల్గొన్నారు.

ఎనిమిది మంది నిర్వాసితులకు నోటీసులు

నౌపడ : సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు నిర్మాణంతో నిర్వాసిత గ్రామస్తులైన ఎనిమిది మందికి మంగళవారం రాత్రి పోలీసులు ముందస్తు నోటీసు జారీ చేశారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి బుధవారం పర్యటన సందర్భంగా ఎటువంటి వివాదాలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నోటీసులు పంపించినట్లు పోలీసులు తెలిపారు. ఏమైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే తీవ్ర చర్యలు ఉంటాయని నోటీసుల్లో పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న వారందరూ టిడిపి సానుభూతిపరులు. వారిలో జీరు నారంనాయుడు, మల్లేశు, జీరు చిరంజీవులు, తాతయ్యతోపాటు మరో ముగ్గురు ఉన్నారు.



వంశధార ప్రాజెక్టు గురించి వివరిస్తున్న చింతాడ రవి

జిల్లా అభివృద్ధి ప్రదాత జగన్

ఆమదాలవలస : జిల్లా అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అని వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. పట్టణంలోని బొడ్డేపల్లిపేటలో ఉన్న జగనన్న ప్రజాసేవ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా వెనకబడి ఉన్న జిల్లా ముఖచిత్రం భావనపాడు పోర్టు నిర్మాణమని, వంశధార లిఫ్ట్ ఏర్పాటు, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ వంటి ప్రాజెక్టులు పూర్తయితే జిల్లా అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని అన్నారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి బుధవారం సిఎం శంకుస్థాపనలు చేయనున్నారని తెలిపారు. వంశధార రిజర్వాయర్‌లో సైడ్ వీయర్ ద్వారా నీటిని నింపలేక రూ. 2000 కోట్ల ఖర్చుతో ఏర్పాటు చేసిన రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నామని, ఒడిశా రాష్ట్రంతో విభేదాలు తీరి నేరడి బ్యారేజీ నిర్మించేంతవరకు వంశధార రిజర్వాయర్ నిరుపయోగంగా ఉంటుందని తెలిపారు. దీనిని అధిగమించడానికి గొట్ట బ్యారేజీ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను రూ.180 కోట్ల ఖర్చుతో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవతో ఏర్పాటు చేసేందుకు సిఎం శంకుస్థాపన చేయనున్నారని అన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు కెప్టెన్ రామారావు, ముద్దాడ ఈశ్వరరావు, అన్నెపు కృష్ణ, సురేష్, రాఘవేంద్ర, రామ్మోహన్ పాల్గొన్నారు.

గిరిజనులను విస్మరిస్తున్న ప్రభుత్వం

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

టిడిపి హయాంలో గిరిజన గ్రామాలను అభివృద్ధి చేశామని, తారు రోడ్లు, సిసి రోడ్లు, తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించామని, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం గిరిజనులను పూర్తిగా విస్మరించిందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆరోపించారు. మండలంలోని లొత్తూరు గిరిజన గ్రామంలో మంగళవారం రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గిరిజన గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వం వ్యతిరేక విధానాలను ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పలాస మండల గిరిజన నాయకుడు సవర కుమార్‌తో పాటు కొంత మంది గిరిజనులు టిడిపిలోకి చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి కేటాయించిన నిధులను సైతం ప్రభుత్వం వాడుకుంటుందని విమర్శించారు. నా తండ్రి గౌతు శ్యాంసుందర శివాజీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గిరిజన ప్రాంతాలకు రోడ్లు, విద్యుత్, తాగునీరు, నివాస గృహాలు మంజూరు చేసి అభివృద్ధి చేశారని అన్నారు. తిత్లీ తపాను సమయంలో గిరిజనులు ఇబ్బందులు పడకుండా త్వరితగతిన తాగునీరు, విద్యుత్ సరఫరా, ఆహార పదార్థాలు అందించామని అన్నారు.

అనంతరం గిరిజనులు మాట్లాడుతూ లొత్తూరు పంచాయతీలో కొన్ని గ్రామాల్లో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని, మందస ప్రాంతంలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒ నంబరు 52 రద్దు చేసే విధంగా చర్యలు చేపట్టాలని శిరీషను కోరారు. గిరిజనులకు అన్యాయం జరగకుండా ఉండేందుకు తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఐటిడిఎ ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, బి.నాగరాజు, దువ్వాడ సంతోష్ కుమార్, వంకల కూర్మారావు, సవర సోమేశ్వరరావు, టి.గంగారాం, జోగ మల్లి, సప్ప నవీన్, కుమ్మరి సింహాద్రి, డల్లి ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గౌతు శిరీష

నేడు జాబ్‌మేళా

కవిటి: టిపిఐ కాంపోసైట్ కంపెనీ ఆధ్వర్యాన బుధవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఎస్‌విజె విద్యాసంస్థల కరస్పాండెంట్ బెందాలం కింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటిఐ పూర్తి చేసిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్ మేళాలో పాల్గొనే అభ్యర్థులు ఉదయం 10.30 గంటలకు ఎస్‌విజె విద్యా సంస్థల ప్రాంగణంలోకి చేరుకోవాలని, అలాగే తమ ఒరిజినల్ ధ్రువపత్రాలు తీసుకురావాలని తెలిపారు.

రేపు ఐటిఐలో...

పలాస: పలాస డాక్టర్ కణితీస్ ప్రభుత్వ ఐటిఐలో ఈ నెల 20న ఉదయం 9.30 గంటలకు ఎలక్ట్రిషియన్, పిట్టర్, వెల్డర్, ఎలక్ట్రానిక్, మెక్ ట్రేడ్‌ల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పైల జవహర్ ప్రకటనలో తెలిపారు. కడపకు చెందిన షిరిడి సాయి ఎలక్ట్రికల్ లిమిడెట్ కంపెనీలో పనిచేసేందుకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని అన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ ఎస్ఎస్‌సి, ఐటిఐ, రెండు పాస్‌పోర్టు ఫొటోలు, ఆధార్ కార్డు, బయోడేటా దరఖాస్తుతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9701566392, 9440344958 నంబర్లను సంప్రదించాలని కోరారు.



వివరాలు తెలుసుకుంటున్న జెడ్‌పిటిసి యశోద

ఆధార్ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని పలాసపురం సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని జెడ్‌పిటిసి తడక యశోద సర్పంచ్ తడక జోగారావుతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

మండలంలోని పాలవలసకు చెందిన తోట వెంకటేశ్వరరావు జపాన్‌లో ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్‌పిటిసి తడక యశోద, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ముందుగా వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. వీరితో పాటు ఎంపిటిసి ఢిల్లీరావు, గ్రామస్తులు శ్రీను, నారాయణరావు, పాపారావు, డి.మోహనరావు, కోమోజీరావు ఉన్నారు.

'ఉపాధి' పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న వైస్ ఎంపిపి గోపయ్య

ప్రజాశక్తి- కవిటి

వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఉపాధి హామీ పనులు ఎంతో ఉపయోగపడతాయని వైస్ ఎంపిపి కర్రి గోపయ్య అన్నారు. మండలంలోని పెద్ద కర్రివానిపాలెంలో మంగళవారం ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలసల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం ఉపాధి హామీ పనులు అమలు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లిన జిల్లా వాసులు ఉంటారని, అందులో అధిక శాతం మత్స్యకారులు ఉంటారని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం ప్రస్తుతం మత్స్యకారులకు ఊరట కలిగిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రభుత్వం న్యాయవాదులకు రక్షణ చట్టం కల్పించి దాడులను అరికట్టాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి డిమాండ్ చేశారు. కోర్టు ఆవరణలో న్యాయవాదులతో కలిసి సిఐడి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ... కోర్టు ఆవరణలో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడ బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్, జడ శ్రావణ్ కుమార్‌లకు సిఐడి పోలీసులు నోటీసులు ఇవ్వడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ఇటీవల మార్గదర్శి చిట్ ఫండ్స్ వ్యవహారాలకు సంబంధించి విజయవాడలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించిన సీనియర్ న్యాయవాదులకు సిఐడి నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ కోర్టు విధులను బహిష్కరించారు. భావ ప్రకటన స్వేచ్ఛ భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఆ హక్కును హరించే అధికారం సిఐడి పోలీసులకు లేదని అన్నారు. కార్యక్రమంలో ఐలు జిల్లా అధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు, న్యాయవాదులు తమ్మినేని అన్నంనాయుడు, బూర్లె సీతారాం, గురుగుబెల్లి ప్రభాకరరావు, హనుమంతు అచ్చెన్నాయుడు, వాడవలస రాజేశ్వరరావు, బగాది రాజేష్, డోల రమణ, కూన రమణ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న న్యాయవాదులు



పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం నాయకుల పరామర్శ

పలాస : ఉపాధ్యాయులు బత్తిని ఓంకార్ ఇటీవల ఆకస్మికంగా అనారోగ్యం పాలై విశాఖపట్నం కేర్ ఆస్పత్రిలో వైద్య సేవలు పొంది ఆరోగ్యం కుదుట ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు కవిటి లక్ష్మణరావు, బమ్మిడి ఆనందరావు, ఉపాధ్యాయులు పెద్దింటి శశిధర్, ప్రజా వాగ్గేయ కారుడు కుత్తుం వినోద్ కుమార్ మంగళవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

మంత్రి ధర్మానకు ఓటమి భయం

శ్రీకాకుళం అర్బన్ : గడపగడపకు కార్యక్రమం పేరుతో గ్రామాలకు వెళ్తున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు రానున్న ఎన్నికల్లో ఓటమి తప్పదని అర్థమైందని, అందువల్లే అభద్రతా భావంతో ఆయన ఓటర్ల చేత ఒట్టు వేయించమని వాలంటీర్లకు హితబోధ చేస్తున్నారని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ విమర్శించారు. అరసవల్లిలోని ఆయన స్వగృహంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మంత్రి స్థాయిలో ఉండి దేవునిపై ఓటర్లకు ప్రమాణం చేయించమని చెప్పడం నైతికంగా దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. చట్టవిరుద్ధమైన చర్యలను, ఎన్నికల నియమాల విషయంలో ప్రజా ప్రాతినిధ్య చట్టం ఉల్లంఘనే అవుతుందని అన్నారు. మంత్రి వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్ సోమోటో చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిధులతో, ప్రజల సొమ్ముతో వేతనాలు తీసుకుంటున్న వాలంటీర్ వ్యవస్థను వైసిపి ఎన్నికలకు ఉపయోగించుకోవడం అధికార దుర్వినియోగమే అవుతుందన్నారు.

విద్యార్థి దశే కీలకం

శ్రీకాకుళం అర్బన్ : భవిష్యత్‌లో ఉన్నత స్థాయిలో స్థిరపడాలంటే విద్యార్థి దశే కీలకమని ఎస్ఎస్ఆర్ ఛారిట్రబుల్ ట్రస్టు అధినేత సూర శ్రీనివాసరావు అన్నారు. తోటపాలెం లోని ఎంపియుపి స్కూల్ మంగళవారం నిర్వహించిన మొదటి వార్షికోత్సవ వేడుకలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే తమ భవిష్యత్‌ను ప్రణాళికాబద్ధంగా మలుచుకోవాలని అన్నారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధం గా చదివితే మంచి స్థానాలకు చేరుకోగలరని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పే విషయాలను గుర్తుపెట్టుకొని ఆచరించాలన్నారు. సర్పంచ్ కల్లేపల్లి తిరుపతిరావు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూర శ్రీను

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



పలాస : అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సోమేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అగ్ని ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఈ సమయంలో అవగాహన లేకపోతే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని అగ్నిమాపకశాఖ అసిస్టెంట్ అధికారి ఎం.వరప్రసాద్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నగరంలోని ఎనబై అడుగుల రోడ్డులో ఉన్న పెట్రోల్ బంకు వద్ద మంగళవారం అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఏ విధంగా ప్రతిస్పందించాలి, నివారణా చర్యలు ఎలా చేపట్టాలన్న అంశాలపై సిబ్బంది డెమో నిర్వహించారు. విద్యుత్ పరికరాలు వినియోగించినప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్నచిన్న ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు అందజేశారు. అలాగే పెట్రోల్ డీజిల్ బంకుల యాజమాన్యం నిబంధనలకు లోబడి అగ్నిమాపక యంత్రాలను ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు మెంటినెన్సు చేసుకుని సిద్ధంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో వాంబే కాలనీ ప్రజలు, పెట్రోల్ బంకు సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

పలాస : పరిశ్రమల్లో జరిగే అగ్ని ప్రమాదాలపై కార్మికులు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక ఎస్ఐ సోమేశ్వరరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పరిశ్రామికవాడ అనంతపురంలోని ఎస్ఎస్ఎస్ ఇంటర్‌నేషన్ ఎక్స్‌పో ప్రయివేట్ లిమిటెడ్ జీడి పరిశ్రమలో కార్మికులకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కలిగించారు. గ్యాస్, విద్యుత్, ఆయిల్‌ల్లో అగ్నిప్రమాదాలు జరిగితే ఏ విధంగా అరికట్టాలో డెమో ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో భాస్కరరావు, యుగంధర్, ప్రేమ్‌కుమార్, మన్మథరావు, సంతోష్‌కుమార్‌లు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసరావు

సచివాలయాల పరిశీలన

ప్రజాశక్తి- జి.సిగడాం

మండలంలోని సీతంపేట, పెంట సచివాలయాలను ఎంపిడిఒ ఎస్.శ్రీనివాసరావు మంగళవారం సందర్శించారు. సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు, వికలాంగులకు, వితంతువలకు, ఒంటరి మహిళలకు అందుతున్న పింఛన్ల వివరాలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. పేదలకు అందుతున్న సంక్షేమ పథకాల వివరాలు జాబితాలు అందుబాటులో ఉంచాలన్నారు. వివిధ దశల్లో ఉన్న నిర్మాణ గృహాల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. అనంతరం సిబ్బంది హాజరును పరిశీలించారు. ఈయన వెంట కార్యదర్శి సురేష్, వైదేహి, అగ్రికల్చర్ గ్రామ అధికారి ముంతా హరీష్‌కుమార్, మహిళా పోలీస్ సావిత్రి ఉన్నారు.

నేడు లచ్చన్న వర్ధంతి

ప్రజాశక్తి- పలాస

పలాసలోని విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద ఉన్న లచ్చన్న విగ్రహం వద్ద సర్దార్ గౌతు లచ్చన్న 17వ వర్ధంతిని బుధవారం నిర్వహిస్తున్నామని టిడిపి పట్టణ అధ్యక్షులు అధ్యక్షుడు బడ్డ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పలాస ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మందస మండలం హరిపురం బాలిగాం కూడలి వద్ద ఉదయం 10 గంటలకు వర్ధంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు మందస టిడిపి అధ్యక్షుడు దుర్యోధన కూడా తెలిపారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించునున్న వేడుకల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సాగరిక

లోలుగులో వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- పొందూరు

ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం ద్వారా అందజేస్తున్న వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు అన్నారు. మండలంలోని లోలుగులో తాడివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణుల, బాలింతల, వృద్ధుల, మంచం పట్టిన రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య సేవలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లోలుగు ధనలక్ష్మి, ఎంపీటీసీ లోలుగు లక్ష్మంనాయుడు, శాలివాహన సంక్షేమాభివృద్ధి కార్పోరేషన్ డైరెక్టర్ కె.వీరాస్వామి, ఉపసర్పంచ్ చంద్రరావు, వైద్యాధికారి సాగరిక, ఎంఎల్‌హెచ్‌పి రవికుమార్, ఏఎన్ఎం వి.సూర్యకాంతం, హెల్త్ అసిస్టెంట్లు జి.వి.అప్పారావు, రమేష్, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణారావు మృతికి సంతాపం

శ్రీకాకుళం అర్బన్ : ఆకాశవాణి, దూరదర్శన్ విశాఖపట్నం, హైదరాబాద్, ఢిల్లీ కేంద్రాల డైరెక్టర్‌గా పనిచేసిన సీనియర్ జర్నలిస్టు ఆకిరి రామకృష్ణారావు మృతిపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడెమీ మాజీ చైర్మన్ అదపాక సత్యారావు సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం విశాఖ నగరంలోని ఆయన మృతి చెందినట్టు తెలుసుకున్న సత్యారావు దిగ్భ్రాంతికి లోనయ్యారు. సుదీర్ఘ కాలం ఆకాశవాణి, దూరదర్శన్ వార్తా విభాగం ఇన్‌ఛార్జిగా పనిచేసి, జర్నలిస్టులతో సత్సంబంధాలు నెరపేవారని, ఎంతో ఆత్మీయత కనబరిచేవారని గుర్తుచేశారు. ఆయన మృతిపై తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.



ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

అభాగ్యులకు అండ

ప్రజాశక్తి- కవిటి

రెక్కాడితే గాని డొక్కాడని ఆ కుటుంబానికి వ్యాధులు చుట్టుముట్టాయి. కూలి పనులు చేసుకుంటూ బతుకుతున్న కవిటి మండలం దుగానపుట్టుగకు చెందిన దూగాన కృష్ణారావు భార్య కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది.ృష్ణారావు తెచ్చిన కూలి డబ్బులతో ఇన్ని రోజులు గడిపిన వీరికి ఇప్పుడు ఆయనా అనారోగ్యానికి గురవ్వడంతో పూట గడవడం కష్టంగా మారింది. వీరి పరిస్థితి తెలుసుకున్న జైహింద్ సేవా ఫౌండేషన్ మంగళవారం గ్రామానికి చేరుకుని తక్షణ సహాయంగా రూ.5 వేలు అందించారు. అంతేకాకుండా దాతలు ఉదారంగా స్పందించి వీరిని ఆదుకోవాలని కోరారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి



మాట్లాడుతున్న ఎంఇఒ తులసీరావు

వజ్రపుకొత్తూరు: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని ఎంఇఒ డి.తులసీరావు అన్నారు. మండలంలోని ఉద్దానం రామకృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశలోనే బంగారు భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలన్నారు. విద్య మనిషికి మూడో నేత్రం అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులకు బాధ్యత ఉండాలని సూచించారు. క్రమశిక్షణతో కూడిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో సర్పంచ్ చింత హేమారావు, హెచ్ఎం పి.రమేష్, ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు లఖినాన కరుణాకర్, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ పద్మనాభరావు, అప్పారావు పాల్గొన్నారు.

సారా విక్రయాలను నియంత్రించాలి



వినతిపత్రం అందజేస్తున్న రాజేష్

కవిటి: మండలంలో నాటుసారా విక్రయాలు జోరుగా సాగుతున్నాయని, అధికారులు స్పందించి తక్షణమే నాటుసారా విక్రయాలను నియంత్రించాలని జనసేన పార్టీ నాయకుడు లోళ్ల రాజేష్ కోరారు. ఈ మేరకు నాటుసారాతో కలిగే అనర్థాలు, కుటుంబ సమస్యలను వివరిస్తూ మంగళవారం కవిటిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీసులకు, పంచాయతీ ఇఒలను కలిసి వినతిపత్రాలను అందించారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ ఇప్పటికే ఒకసారి నాటుసారా విక్రయాలపై వినతి పత్రాలు అందజేశామని అన్నామని ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే ఇక ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నాటుసారా తాగి పేదలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజంతా కష్టపడి తెచ్చిన సంపాదన నాటు సారాకే ఖరు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాటుసారా విక్రయాలు నియంత్రించాలని కోరారు.



అవగాహన కల్పిస్తున్న డిఎంఒ సత్యనారాయణ

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి- కవిటి

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు నియంత్రించవచ్చని జిల్లా మలేరియా నివారణ అధికారి (డిఎంఒ) డాక్టర్ పి.వి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని కపాసుకుద్దిలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ పలు సూచనలు, సలహాలు అందించారు. అనారోగ్యానికి గురైనప్పుడు స్థానిక ఆశ, ఎఎన్ఎంల ద్వారా ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటూ, వ్యక్తిగత పరశుభ్రత పాటించాలని సూచించారు. ముఖ్యంగా తాగునీరు, తినే ఆహార పదార్థాలు పరిశుభ్రమైన ప్రదేశంలో ఉంచుకుని, మూతలు పెట్టుకోవాలని, నిల్వ ఉన్న నీటిని వినియోగించకూడదని తెలిపారు. చిన్నచిన్న జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంఒ డాక్టర్ ఎల్.శ్రీకాంత్, ఎస్.యు.ఒ ఎస్.ఎన్ పాణిగ్రాహి, డా శశిధర్, అభిమన్యు సోయి, కేశవరావు, సర్పంచ్ ప్రతినిధి కాయ భీమసేను, ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నగరంలోని గూనపాలెంకు చెందిన కిల్లంశెట్టి మోహనరావు, గోవిందమ్మ దంపతులు మంగళవారం విరాళం అందజేశారు. ఆలయాన్ని సందర్శించిన మోహనరావు దంపతులు ఇఒ కార్యాలయంలో ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర రావును కలిసి రూ.1,01,116 చెక్కును అందజేశారు.

ఘనంగా ప్రపంచ వారసత్వ దినోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ప్రాచీన కట్టడాలు, వారసత్వ సంపదగా మిగిలి ఉన్న చారిత్రక కట్టడాలు పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని సెట్‌శ్రీ సిఇఒ బి.ప్రసాదరావు పేర్కొన్నారు. ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని జిల్లా పర్యాటకశాఖ, సెట్‌శ్రీ, ఇంటెక్ సంయుక్తంగా మంగళవారం నిర్వహించారు. నగరంలోని ప్రాచీన కట్టడమైన ఉమారుద్రకోటేశ్వర ఆలయం నుంచి ర్యాలీ ఏడు రోడ్ల కూడలి ప్రభుత్వ మహిళ, పురుష కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోటేశ్వర ఆలయాన్ని హెర్టేజ్ గుర్తింపుకు వాక్ నిర్వహించామని అన్నారు. ఈ ఆలయాన్ని పురావస్తు శాఖ గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారి నారాయణరావు, నాగావళి హోటల్ ఎండీ ఆనంద్, ఇంటాక్ సభ్యులు రాధాప్రసాద్, కొమ్ము రమణమూర్తి పాల్గొన్నారు.

పలుచోట్ల గ్రామసభలు



పోలాకి : మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ప్రజాశక్తి- పోలాకి

గ్రామంలో నెలకొన్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తామని పోలాకి పంచాయతీ ప్రత్యేక అధికారి కె.కోటీశ్వరరావు అన్నారు. మండలంలోని పోలాకి, కొత్తరేవు, కె.పి.వలస, మబగాం, మగతాపాడు, పల్లిపేట పంచాయతీలో మంగళవారం గ్రామసభలను నిర్వహించారు. పోలాకి గ్రామసభలో కొందరు తాగునీటి సౌకర్యం కల్పించాలని, సిసి రోడ్లు నిర్మించాలని, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపర్చాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మజ్జి రవణమ్మ, ప్రతినిధి మజ్జి లక్ష్మీనారాయణ, వైసిపి నాయకులు ఆర్.త్రినాథరావు, పంచాయతీ కార్యదర్శి రోహిణి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కవిటి : పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు దుగానపుట్టుగ సర్పంచ్ దుగాన భద్రాచలం అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన పంచాయతీలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేసినట్టు తెలిపారు. తాగునీరు, రహదారులకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించినట్టు పేర్కొన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా తాగునీటికి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశామని, ఇప్పటికే గ్రామాల్లో బోర్లను మరమ్మతులు చేయించామని అన్నారు. వార్డు సభ్యులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.